ఆంధ్రజ్యోతి





బసవన్నలే నేస్తాలు.. బతుకంతా కష్టాలు!

సండే స్పెషల్ SUNDAY SPECIAL

ఆదరణ కరువై.. బాగుపడని గంగిరెద్దుల వారి జీవితాలు

సంక్రాంతి వేళ కానరాని సందడి..

- ప్రభుత్వాలు మారుతున్నా అందని చేయూత
- సంచార జీవితంతో బతుకులు అగమ్యగోచరం
- ఉండేందుకు ఇళ్లు లేని దీన స్థితిలో కుటుంబాలు

7



గంగిరెద్దుతో విన్యాసాలు చేస్తున్న కళాకారులు (ఫైల్)

సంక్రాంతి వచ్చిందంటే ఒకప్పుడు.. పిండివంటల ఘుమఘుమలు.. పతంగులు, ముగ్గుల సందళ్లు.. డూడూ బసవన్నల విన్యాసాలు కనిపించేవి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా లోగిళ్లన్నీ కళకళలాడేవి. కానీ మారిన కాలమాన పరిస్థితులు.. పెరిగిన సాంకేతికతతో పండుగలు కళతప్పుతున్నాయి. సంక్రాంతి పండుగ అంటే గుర్తొచ్చే గంగిరెద్దుల విన్యాసాలు కనుమరుగయ్యాయి. ఏళ్లకేళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా.. గంగిరెద్దులను ఆడించే వారిని పట్టించుకునే వారు లేక.. ఆ సంచార జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. తాత ముత్తాతల నుంచి వస్తున్న ఆచారాలను వదులుకోలేక.. గంగిరెద్దులను ఆడించే వృత్తినే జీవనాధారంగా చేసుకుని.. కష్టాలతో సావాసం సాగిస్తూ.. గంగిరెద్దులనే ఆస్తిగా నమ్ముకొని కూటి కోసం కోటి తిప్పలు పడుతూ ఆ కుటుంబాలు బతుకు సమరం సాగిస్తున్నాయి. ఎవరు ఆదరించినా.. ఆదరించకపోయినా.. బసవన్నల ఆటతో పూట గడవకపోయినా.. నమ్ముకున్న వృత్తిని వదిలేది లేదంటున్నాయి.

- రఘునాథపల్లి, ఆంధ్రజ్యోతి

కుల, చేతి వృత్తులకు పీఎం విశ్వకర్మ

ఉపాధి కల్పిస్తున్న పథకం

- రూ.1లక్ష నుంచి రూ.3లక్షల వరకు తక్షణ సహాయం
- రూ 5శాతం వడ్డీతో రుణం..
- కులంతో సంబంధం లేకుండా పథకం అమలు
- కేంద్ర ప్రభుత్వ సిఫారసుతో వర్తింపు





భూపాలపల్లిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్యం కలిగిన నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం "విశ్వకర్మ యోజన" పథకం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఎటువంటి షూరిటీలు లేకుండా నేరుగా లబ్ధిదారుడి ఖాతాల్లోకి జమచేసే ప్రక్రియ కొనసాగిస్తుంది. ఈ విధానం ప్రారంభమై ఏడాదిన్నర కావస్తుంది. లబ్ధిదారుని వృత్తిని ఆధారంగా చేసుకుని దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా వృత్తుల్లో శిక్షణ ఇచ్చి మరీ రుణం అందజేస్తుంది. దీంతో వారు ఉపాధి పొందవచ్చని పరిశ్రమల శాఖ అధికారులు చెబుతున్నారు. 4 సంవత్సరాలకు 5శాతం వడ్డీరేటుతో ప్రతి లబ్ధిదారునికి రూ.1లక్ష నుంచి రూ.3లక్షల వరకు రుణం అందించనున్నారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం..

ఈ పథకం ముఖ్య ఉద్దేశం వృత్తి నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం. దీనినే పీఎం విశ్వకర్మ యోజన లేదా విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ అని కూడా పిలుస్తారు. ఈ పథకం ద్వారా రూ.1లక్ష నుంచి రూ.3లక్షల వరకు రుణం అందిస్తారు. ఈ రుణం అందించడానికి ఎలాంటి ఆంక్షలు లేకుడా లబ్ధిదారుడి ఖాతాలోకి నేరుగా వెళ్లే చర్యలు కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ఇది పూర్తిగా మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ చే రూపొందించబడిన కేంద్ర ప్రభుత్వ పథకం. ఇది మార్కెట్ లింకేజ్ సపోర్ట్, స్కిల్ ట్రైనింగ్, నిర్దిష్ట ట్రేడ్‌లలో నిమగ్నమైన చేతి వృత్తుల వారికి, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహానికి కేటాయించబడిన స్కీం. దరఖాస్తు అనంతరం ధృవీకరణ జరిగాక వారు విశ్వకర్మలుగా గుర్తించబడి రుణం అందుకుంటారని అధికారులు తెలిపారు. ఈ పథకాన్ని 2023 సెప్టెంబరు 17న కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది.

అతి తక్కువ వడ్డీ..

ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునే వారికి ప్రభుత్వం 1వ విడతగా రూ.1లక్ష చెల్లిస్తుంది. దీనికి వడ్డీ రేటు 18నెలల్లో 5శాతం మాత్రమే చెల్లించాల్సి ఉంది. అలాగే రెండవ విడతగా రూ.2లక్షల వరకు ఇస్తుంది. ఈ డబ్బులు 30నెలల వాయిదాలో చెల్లించవచ్చు. దీనికి కూడా 5 శాతం వడ్డీనే తీసుకుంటుంది.

ఇలా విడతల వారీగా రూ.3లక్షల వరకు రుణం తీసుకుని నాలుగేళ్లలో కేవలం 5 శాతం వడ్డీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. పైగా స్కిల్ అప్ గ్రేడేషన్, టూల్‌కిట్ ఇన్సెంటివ్, క్రెడిట్ సపోర్ట్, మార్కెటింగ్ సపోర్ట్, డిజిటల్ లావాదే వీలకు ప్రోత్సాహం, పీఎం విశ్వకర్మ సర్టిఫికేట్, ఐడీ కార్డు అందజేస్తుంది. మొదటగా వారం రోజులు శిక్షణ ఇచ్చి అనంతరం 15రోజుల పాటు అధునాతన శిక్షణ కూడా ఇస్తుంది. ఈ శిక్షణా కాలంలో రోజుకు రూ.500 కూడా చెల్లిస్తుంది. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేసి రుణం వారి ఖాతాల్లోకి జమచేస్తుంది.

ఎవరు అర్హులు?

ఈ రుణం తీసుకోవడానికి 18 ఏళ్ల వయస్సు పైబడిన వారెవరైనా అర్హులే.. అలాగే దరఖాస్తుదారుడు గత ఐదేళ్లలో స్వయం ఉపాధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల ద్వారా రుణం పొంది ఉండకూడదు. ఐదేళ్లలో తీసుకున్న రుణం పూర్తిగా చెల్లించి ఉండాలి. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉద్యోగం చేస్తున్న వారు అనర్హులు. ఈ పథకం రిజిస్ట్రేషన్, ప్రయోజనాలు కుటుంబంలోని ఒక సభ్యునికి మాత్రమే పరిమితం చేయబడ్డాయి. దీని కోసం దరఖాస్తుదారుడు కామన్ సర్వీస్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు విధానం ఇలా..

చెక్క ఆధారిత పరిశ్రమ కోసం పనిచేసే సుతారి(కార్పెంటర్/ బధాయి), ఇనుము, మెటల్‌బేస్డ్, స్టోన్ బేస్డ్ వాటి కోసం పనిచేసే కవచుడు, కమ్మరి, హామర్, టూల్‌కిట్ మేకర్, తాళం చేసేవారు, శిల్పి, స్టోన్ బ్రేకర్, అలాగే గోల్డ్ స్మిత్, చెప్పులు కుట్టేవారు, తట్టలు, బుట్టలు అల్లేవారు, బార్బర్, గార్లాండ్ మేకర్, వాషర్‌మెన్ (దోబీ), దర్జీ, ఫిషింగ్ నెట్ మేకర్, కొయిర్‌నేత తదితర వాటిలో నైపుణ్యం గలవారు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. వీటితో దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్‌కార్డు, మొబైల్‌నెంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, రేషన్‌కార్డు కలిగి ఉండాలి.

3,547 దరఖాస్తులు వచ్చాయి..

- సిద్దార్థ్, పరిశ్రమల శాఖ అధికారి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి ఇప్పటివరకు తమకు 3547 దరఖాస్తులు వచ్చాయి. ఈ పథకం ద్వారా వృత్తి నైపుణ్యం కలిగిన నిరుద్యోగులను కేంద్ర ప్రభత్వం ప్రోత్సహిస్తుంది. ఇంకా వేలాది మందికి అవకాశం ఉంది. ఉత్సాహం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. సమీపంలోని సీఎస్‌సీ సెంటర్‌ను సంప్రదించాలి.

మొన్న లగచర్ల.. నేడు మహదేవపూర్..

- రైతుల ఆవేదన విన్నాకే ఇక్కడకు వచ్చా
- కాంగ్రెస్ ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోంది
- మహదేవపూర్ పర్యటనలో మాజీ స్పీకర్ మధుసూదనచారి



చిన్నకాళేశ్వరం కెనాల్ కోసం తీస్తున్న ట్రెంచ్‌ను పరిశీలించేందుకు వెళ్తున్న నాయకులు

వివరాలు 6వ పేజీలో

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభల నిర్వహణ

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రైతుభరోసా, ఇందిరమ్మఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల లబ్దిదారుల ఎంపికకు గ్రామసభల నిర్వహణకు షెడ్యూల్ రూపొందించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించా రు. శనివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడిన కలెక్టర్ ఈనెల 26వ తేదిన ప్రభుత్వం 4 పథకాలు అందించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. రైతు భరోసాను సాగు చేసే భూములకు మాత్రమేఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఆధారంగా నెలలో కనీసం 20రోజులు పనిచచేసే వారిని మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులుగా గుర్తించాలన్నారు. ఈనెల 16వ తేది నుంచి 20వ తేదివరకు వివరాలు సేకరించి 24వ తేదిన గ్రామసభలు నిర్వహించి తుదిజాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈనెల 25, 26 తేదీల్లో డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. 26వ తేది నుండి నూతన రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామీ, పట్టణ ప్రాంతాల్లో ప్రజల ఆదాయంను ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. నూతన రేషన్‌కార్డుల జారీకి కులగణన జాబితా ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి అర్హులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మీ, డీపీఓ నారాణయరావు, డీఎస్‌ఓ శ్రీనాధ్,డీఆర్డీఓ నరేష్ డీఏఓ విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వనంలో 32 ఏళ్లు!

- ఎస్పీ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయిన సోమయ్య
- నాలుగు హింసాత్మక ఘటనల్లో నిందితుడు
- విలేకరులకు వివరాలు వెల్లడించిన ఎస్పీ కిరణ్‌ఖరే



లొంగిపోయిన మావోయిస్టు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల ప్రేరణాత్మక పాటలతో ఆకర్షితుడై పార్టీలో చేరి వివిధ హోదాల్లో పని చేసిన మావోయిస్టు.. జనజీవన స్రవంతిలో కలిశారు. 32 ఏళ్ల వనంలో తన జీవనాన్ని సాగించి.. అనారోగ్యం ఇతరత్రా కారణాలతో స్వచ్ఛందంగా జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఎదుట లొంగిపోయాడు. శనివారం భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ కిరణ్‌ఖరే వివరాలను వెల్లడించారు. భూపాలపల్లి మండలంలోని పంబాపూర్ గ్రామానికి చెందిన మచ్చ సోమయ్య అలియాస్ సమ్మయ్య, అలియాస్ సతీష్ 1990లో సీపీఐ(ఎంఎల్) పీడబ్ల్యుజీ యొక్క ఫ్రంటల్ ఆర్గనైజేషన్ అయిన రైతు కూలీ సంఘం (ఆర్‌సీఎస్)లో చేరాడు. వివిధ హోదాల్లో పని చేసిన ఆయన ప్రస్తుతం డీసీఎస్ ఇన్‌చార్జ్ ఆఫ్ అగ్రికల్చరల్ వింగ్, సౌత్ బసర్ డీవీసీ, డీకేఎస్‌జెడ్‌సీ ఆఫ్ సీపీఐ మావోయిస్టు పార్టీ జిల్లా కమిటీ సెక్రటరీగా పని చేస్తున్నాడు. తెలంగాణ, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పలు హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నాడు. 1998లో గండికామారం ఈఓఎఫ్‌లో పాల్గొన్నాడు. ఈ ఘటనలో చిట్యాల దళ కమాండర్ వెంకన్న మృతి చెందాడు. 2002లో సింగారం-పందిపంపుల ఈఓఎఫ్‌లో పాల్గొన్నాడు. 2018లో జరిగిన దూలేడు ఈఓఎఫ్‌లో పాల్గొన్నాడు. వీటితో పాటు గత ఏడాది 2024లో పాలగూడెం ఈఓఎఫ్‌లో పాల్గొన్నాడు.ఈ క్రమంలో 2023 నుంచే ఆరోగ్యం సహకరించడం లేదు. వృద్ధాప్య వయస్సుకు చేరుకున్నాడు. వయస్సు సహకరించకపోవడంతో జనజీవన స్రవంతిలోకి వచ్చేందుకు ఎర్రాల్ ఎస్‌జెడ్‌సీఎం సౌత్ బస్తర్ డీవీసీ ఇన్‌చార్జ్ అనుమతి కోరారు. ఎర్రాల్ ఎస్‌జెడ్‌సీఎం అదే ప్రతిపాదనను కేంద్ర కమిటీకి పంపింది. అప్పుడు కేంద్ర కమిటీ లొంగిపోవడానికి సానుకలంగా స్పందించింది. దీంతో ఆయన నేరుగా పోలీసులను ఆశ్రయించి స్వచ్ఛందంగా లొంగిపోయాడు. అజ్ఞాతంలోకి వెళ్లిన మచ్చ సోమయ్య, అలియాస్ సమ్మయ్య, అలియాస్ సురేందర్, అలియస్ సతీష్‌పై ప్రభుత్వం రూ.8 లక్షల రివార్డు ప్రకటించింది. దీంతో స్వచ్ఛందంగా లొంగిపోయిన ఆయనకు జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే రూ.8 లక్షలు చెక్కును ఆయనకు అందించారు.

మీ ముగ్గురూ లొంగిపోండీ..

మావోయిస్టులో వనంలో ఉండి సాధించేదేమి లేదని, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలతో స్వేచ్ఛాయుతమైన జీవనాన్ని సాగించాలని జిల్లా ఎస్పీ కోరారు. చత్తీస్ఘడ్ రాష్ట్రంలో ఉగ్ర కార్యకలాపాలకై సీపీఐ మావోయిస్టులో పని చేస్తున్న యూజీ క్యాడర్‌లో పని చేసే జిల్లాకు చెందిన వారు గాజర్ల రవి, అలియాస్ గణేష్, గాజె రాజు, అలియాస్ రవి, చెన్నూరి హరీష్ అలియాస్ రామన్నలు కూడా స్వచ్ఛందంగా లొంగిపోవాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి ఎస్సై దాసరి సుధాకర్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కలల సాధానికి క్రెడాయి అద్భుత వేదిక

మంత్రి పొన్నం ప్రభాకర్ ▸ హనుమకొండలో క్రెడాయి ప్రాపర్టీ షో

హనుమకొండ టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల కలల సాధానికి క్రెడాయి సంస్థ ఒక అద్భుత వేదిక అని, ఆ సంస్థలో గృహ నిర్మాణంతో పాటు గృహోపకరణాలు అందుబాటులో ఉంచడం గొప్ప విశేషమని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం హనుమకొండలోని పీజీఆర్ గార్డెన్‌లో క్రెడాయి జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రెడాయి ప్రాపర్టీ షో కార్యక్రమానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. క్రెడాయి సంస్థ 1999లో ఢిల్లీలో ప్రారంభమై అంచలంచెలుగా ఎదుగుతూ దేశ వ్యాప్తంగా రావడం గొప్ప పరిణామని అన్నారు. సామాజిక కార్యక్రమాలు చేపట్టడంపై క్రెడాయి సంస్థ ప్రతినిధులను మంత్రి అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట త్రినగరాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇటీవలే ప్రజాప్రభుత్వ నాయకత్వంలో రూ.6వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విషయం గుర్తు చేశారు. రైలు మార్గం, ప్రధాన జాతీయ రహదారులు, విద్యా రంగాల్లో కాకతీయ యూనివర్సిటీ కిట్స్, ఎన్ఐటీ, వైద్య రంగంలో ఎంజీఎం, కాకతీయ మెడికల్ కాలేజీ ఉన్నాయన్నారు. అన్ని విధాలుగా అభివృద్ధికి యోగ్యమైన ప్రాంతంగా హనుమకొండ నగరం ఉందని, క్రెడాయి లాంటి సంస్థ ప్రాపర్టీ షోలను నిర్వహించడం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రియల్టర్ కన్‌స్ట్రక్షన్లకు పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొంత మేర రియల్ ఎస్టేట్ రంగం వెనక్కి తగ్గిందని, రానున్న రోజుల్లో మరింత వేగంగా పెరుగుతుందన్నారు.

అత్యవసర సేవలందించే ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేటు వైద్య సిబ్బంది కొనసాగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ జ్ఞప్తి చేశారు. వారికి ఇవ్వాల్సిన బకాయిలను ప్రభుత్వం విడతల వారిగా అందిస్తుందన్నారు. రేషన్ కార్డు లేని వారికి త్వరలోనే రేషన్ కార్డులు అందిస్తామన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్, ఇతర సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల వద్ద ప్రైవేటు ట్రావెల్స్‌వారు అధిక చార్జీలు వసూలు చేస్తే అనుమతులను రద్దు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్లలో ప్రజలను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, భూమి లేనివారికి రెండు విడతలుగా రూ.6వేల చొప్పున అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయి రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి, అజయ్‌కుమార్, జగన్, రాంరెడ్డి, రామచంద్రారెడ్డి, సీహెచ్. సత్యనారాయణరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, ఎన్.అమరేందర్‌రెడ్డి, ఎస్. అమర్‌లింగేశ్వర్‌రావు, ఎం. రవీందర్‌రెడ్డి, జె. మనోహర్, ఎల్. రజినీకాంత్‌రెడ్డి, ఎం. రాజ్‌కుమార్, జి.రాజేందర్‌రెడ్డి, ఎం. వెంకటమల్లారెడ్డి, వరుణ్ కుమార్, అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

మొన్న లగచర్ల.. నేడు మహదేవపూర్

- రైతుల ఆవేదన విన్నాకే ఇక్కడకు వచ్చా
- నియంతలా కాంగ్రెస్ ప్రభుత్వం తీరు
- మాజీ స్పీకర్ మధుసూదనాచారి

మహదేవపూర్ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టులు రైతులను ఒప్పించి కట్టాలి కాని.. ఇలా నియంతలా వ్యవహరించి కట్టొద్దని మాజీ స్పీకర్, శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మహదేవపూర్‌లో మరో లగచర్ల ఘటనను పునరావృతం చేస్తు రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని హితవు పలికారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్‌తో కలిసి శనివారం మహదేవపూర్ మండలంలోని ఎల్కేశ్వరం, బొమ్మాపూర్, సూరారం గ్రామాలకు చెందిన చిన్నకాళేశ్వరం భూనిర్వాసితులతో మాట్లాడారు. ముందుగా ఎల్కేశ్వరం శివారులో చిన్నకాళేశ్వరం ప్రాజెక్టులో కోల్పోతున్న భూములను పరిశీలించిన నాయకులు నిర్వాసిత రైతులతో మాట్లాడారు. అనంతరం లక్ష్మీపూర్ శివారులో పనులు చేపడుతున్న ప్రాంతానికి వెళ్లి అక్కడి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పూర్తిగా వ్యవసాయమే జీవనాధారంగా బతికే రాష్ట్రం అని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ రోజు రైతుల సుఖంగా లేరని అన్నారు. గిట్టుబాట ధర నుండి మొదలు విత్తనాలు, ఎరువులు, కరెంటు, సాగునీటి, లోన్ల వరకు అనేక గోసలు పడ్డామని.. తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందుచూపుతో వ్యవసాయం పండగా అనేలా చేశామన్నారు. గడిచిన సంవత్సర కాలంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. చిన్నకాళేశ్వరం భూనిర్వాసిత రైతులు ఆర్తనాదాలు విన్నాం కనుకనే ఈ రోజు ఇక్కడకు వచ్చామని అన్నారు. తమ నాయకుడు ఎన్నో భారీ నీటి ప్రాజెక్టులు చేపట్టి భూమితో పాటు అందులో ఉన్న పంటకు నష్టపరిహారం చెల్లించినట్లు గుర్తుచేశారు.


చిన్నకాళేశ్వరం కెనాల్ కోసం తీసిన ట్రెంచ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

కాని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 60ఎకరాల పైచిలుకు భూమిలో ప్రాజెక్టు నిర్మించేందుకు పోలీసు పహారాతో పనులు చేపట్టడం దారుణమన్నారు. పత్తి పంట చేతికొచ్చే సమయంలో పంటను నాశనం చేస్తూ పనులు చేయడం ఏంటని మండిపడ్డారు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడుతున్న అధికారులు, నాయకులపై ప్రాసిక్యూట్ చేసి కేసులు పెట్టాలన్నారు. రైతులు పరిహారం అందలేదంటున్నారని.. తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

చిన్నకాళేశ్వరం సమస్య రైతులది కాదని.. ఇక నుంచి ఇది బీఆర్ఎస్ పార్టీదని అన్నారు. ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు.. రాష్ట్రానికి న్యాయం చేసే క్రమంలో సొంత నియోజవర్గ ప్రజలకు న్యాయం చేయకపోతే ఎలా అన్ని ప్రశ్నించారు. మానిఫేస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న శ్రీధర్‌బాబు కాళేశ్వరం భూనిర్వాసిత రైతులకు పరిహారం రెట్టింపు చేస్తామని చెప్పి తన నియోజకవర్గంలోనే అమలు చేయడం లేదని విమర్శించారు. అనంతరం మంథని మాజీ శాసన సభ్యులు పుట్ట మధుకర్ మాట్లాడుతూ ఒక్క మహదేవపూర్ మండలమే కాకుండ మహముత్తారం, కాటారం మండలాల్లోను ఈసమస్య ఉందన్నారు.

దీనిపై ప్రత్యేక జీవో తీసుకువచ్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే భూపాలపల్లి, పెద్దపల్లి కలెక్టర్లు నోరు మెదపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు లింగంపెల్లి శ్రీనివాస్, నాయకులు అన్కారి ప్రకాశ్, అలీం ఖాన్, మార్క రాముగౌడ్, మహిళనాయకురాలు కేదారి గీతభాయి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలను ఘనంగా నిర్వహించాలి

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు


సరస్వతీ పుష్కరాలపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, గోదావరి సంగమ తీరంలోని పుష్కర ఘాట్లను కాశీ, హరిద్వార్, ప్రయగ పుణ్యక్షేత్రాల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మే 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతీ నది అంతర్వాహిని పుష్కరాల ఏర్పాట్లను సమీక్షించేందుకు శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. పర్వదినాల సందర్భంగా చేసే ఏర్పాట్లల కాకుండా శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలన్నింటిని అత్యాధునిక వసతులతో కళాత్మకంగా రూపొందించాలని మంత్రి ఆదేశించారు. సరస్వతి పుష్కరాలు దేశంలో ఎక్కడా జరుగవేని కాళేశ్వర సంగమ స్థలంలో మాత్రమే వందల ఏళ్లుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. చత్తీస్‌గడ్, తెలంగాణ, మహా రాష్ట్ర కూడలిలో గోదావరి, ప్రాణహిత నదులు, అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే అత్యంత పవిత్రమైన సంగమమని తెలిపారు.

స్నానఘట్టాలను అత్యాధునికంగా నిర్వహించాలన్నారు. భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ, సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన పనులు వేగవంతంగా కావాలన్నారు. హెలీకాప్టర్ల కోసం హెలీప్యాడ్‌లు సిద్ధం చేయాలన్నారు. దేవాదాయ, నీటి పారుదల, రోడ్ల భవనాలు, పంచాయతీరాజ్, రెవెన్యూ టూరిజం, ట్రాన్స్‌కో, ఆర్టీసీ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కాళేశ్వరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఉండ ప్రదేశంలో అత్యాధునిక బస్టాండ్‌ను నిర్మించాలన్నారు. వీధి దీపాల ఏర్పాటుకు ఇప్పటికే రూ 62 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఫిబ్రవరి 7 నుంచి 19 వరకు నిర్వహించనున్న మహా కుంభాభిషేకం పనులను ఎక్కడా లోపం లేకుండా చూడాలని తెలిపారు.

సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజా రామయ్యార్, భపాఆలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు, ఎస్ఈ దుర్గా ప్రసాద్, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, డీపీఆర్వో శ్రీనివాసరావు, ఆర్టీసీ డివిజన్ మేనేజర్ ఇందు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు11 మంది..

- ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగే పరేడ్‌కు ఎంపిక
- వివిధ రంగాలకు చెందిన వారికి చోటు

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం రోజున దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నుంచి పలు రంగాలకు చెందిన 11 మందికి అవకాశం దక్కింది. కేంద్ర హోం మంత్రిత్వశాఖ రాష్ట్రం నుంచి మొత్తం 72మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపిక చేయగా.. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 11 మంది ఉన్నారు. పరేడ్‌కు ఎంపికైన వారిలో పీఎం యశస్వి పథకం లబ్ధిదారులైన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరకు చెందిన జె.ప్రశాంత్, దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారానికి చెందిన బి గీతిక, వరంగల్ జిల్లా నర్సంపేట బీసీ బాలికల హాస్టల్‌కు చెందిన బీమగాని శాలిని, హ్యాండీక్రాఫ్ట్ విభాగంలో ములుగు జిల్లా మంగపేట మండలం దొమెడ గ్రామానికి చెందిన కొమురం ఆదిలక్ష్మి, గ్రామీణాభివృద్ధి విభాగంలో హనుమకొండ జిల్లా శాయంపేటకు చెందిన దాసరి కల్పన, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలకేంద్రానికి చెందిన బండారి మంజుల, వరంగల్ జిల్లా వర్దన్నపేట మండలం ఇల్లందకు చెందిన ఎడ్ల అరుణ, ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన మేక ప్రశాంతి కుమారి ఉన్నారు. ఇక పీఎం మత్స్య సంపద యోజన లబ్ధిదారైన వరంగల్ జిల్లా కుమ్మరివాడ ఉర్సుకు చెందిన బైరిశెట్టి పట్టాభి, ప్రధాని మన్‌కీబాత్‌లో పాల్గొన్నవారి నుంచి జనగామ జిల్లా వీవర్స్ కాలనీకి చెందిన చక్రాల సంతోష్ కుమార్, వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపల్లికి చెందిన గోనె మల్లయ్య ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

ములుగు కలెక్టర్ దివాకర


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఆయా పథకాల అమలుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ రైతుల సంక్షేమం, నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల వ్యూరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రైతుభరోసా పథకంలో అర్హులైన రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో సమీక్షించి లబ్ధిదారుల పేర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం కింద లబ్ధిదారులకు ఆర్థికసహాయం అందించడానికి అవసరమైన జాబితా సిద్ధం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. వ్యూరిఫికేషన్ ప్రక్రియను ఈనెల 16నుంచి ప్రారంభించి 20వతేదీ వరకు పూర్తి చేయాలని, 16నుంచి 18వతేదీ వరకు ఫీల్డ్ పనులు పూర్తిచేసి 19నాటికి కార్యాలయంలో సమీక్ష జరిపి తుది జాబితాను 20వతేదీన సమర్పించాలన్నారు.

21వ తేదీ నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించి తుది జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఖరారు చేయాలన్నారు. ప్రతి మండలాన్ని రెండు భాగాలుగా విభజించి ప్రతి విభాగానికి డిప్యూటీ తహసీల్దార్‌ను బాధ్యత వహించేలా నియమించాలని, డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను వెంట ఉంచుకుని డేటాను సక్రమంగా సమీక్షించి సరైన పద్ధతిలో సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయశాఖ అధికారులు, ఎంపీవోలు, ఈడీఎం దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

'సెపక్‌తక్రా'లో ఏపీపీ క్రీడాకారుల హవా

- పురుషులు, మహిళల డబుల్స్‌లో ప్రథమ స్థానం
- జేఎన్ఎస్‌లో కొనసాగుతున్న చాంపియన్‌షిప్ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ బండా ప్రకాష్

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో డబుల్స్ పురుషుల, మహిళల విభాగంలో ఆలిండియా పోలీస్ (ఏపీపీ) క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండింటిలోనూ విజేతగా నిలిచి స్వర్ణ పతకాలు సాధించారు. శనివారం హనుమకొండ జేఎన్ ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలో సెపక్‌తక్రా పురుషుల డబుల్స్‌లో నిర్వహించిన ఫైనల్స్‌లో బిహార్‌పై ఏపీపీ క్రీడాకారులు విజయఢంకా మోగించి ప్రథమ స్థానంలో నిలువగా, ద్వితీయ స్థానంలో బిహార్, తృతీయ స్థానంలో తెలంగాణ, హరియానా క్రీడాకారులు నిలిచారు. అదేవిధంగా మహిళల విభాగంలో ఏపీపీ వర్సెస్ తెలంగాణ జట్ల మధ్య జరిగిన ఫైనల్‌లో తెలంగాణపై ఏపీపీ విజయదుందుభి మోగించగా తృతీయ స్థానంలో ఢిల్లీ, కేరళ రాష్ట్రాల జట్లు నిలిచాయి. టీమ్ ఈవెంట్ పురుషుల విభాగంలో ఢిల్లీపై మణిపూర్ జట్టు గెలుపొందగా ఎస్ఎస్‌బీ, అస్సాం జట్లు తృతీయ స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో నాగాలాండ్‌పై ఎస్ఎస్‌బీ జట్టు గెలుపొందగా తృతీయ స్థానంలో ఉత్తరప్రదేశ్, మణిపూర్ జట్లు విజయకేతనం ఎగురవేశాయి.

ఈ క్రీడాపోటీలను శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీల్లో విజయం సాధించాలని సూచించారు. సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెక్కల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయస్థాయి సెపక్‌తక్రా పురుషులు, మహిళలకు టీమ్ ఈవెంట్, డబుల్స్‌లలో జరిగిన ఫైనల్స్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీతత్వాన్ని ప్రదర్శించారు. అదేవిధంగా రెగో, కాడ్ విభాగాల్లో పోటీలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎస్.ఆర్.ప్రేమ్‌రాజ్, ప్రధానకార్యదర్శి వీరాగౌడ్, కోశాధికారి నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జితేంద్రనాథ్, పీఈటీలు, పీడీలు, టెక్నికల్ అఫీషియల్స్, రెఫరీలు తదితరులు పాల్గొన్నారు.


డబుల్స్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

క్రీడల అభివృద్ధి కోసం స్పోర్ట్స్ పాలసీ

- క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ నిర్వహణ
- సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి
- ఘనంగా మోడ్రన్ కబడ్డీ క్రీడలు ప్రారంభం

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి నరేందర్‌రెడ్డి తండ్రి చెన్నకృష్ణారెడ్డి, సోదరుడు పురుషోత్తంరెడ్డిల జ్ఞాపకార్థం వేం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొలి రాష్ట్రస్థాయి మోడల్ కబడ్డీ అండర్ 17 బాలబాలికలు, సీనియర్ మహిళలు, పురుషుల పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్‌తో గౌరవ వందనం స్వీకరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రపంచస్థాయికి తీసుకువెళ్లేందుకు ఇటీవలె సీఎం కప్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని భావిస్తున్న ప్రభుత్వం గచ్చిబౌళి స్టేడియం వేదికగా చేసుకొని ప్రత్యేక క్రీడా విధానంతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కేసముద్రానికి మంజూరైన 30 పడకల ఆస్పత్రిని 50 పడకలకు పెంచినట్లు తెలిపారు. మండలంలో 132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని, కేసముద్రంలో రోడ్ల విస్తరణను ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా చేపట్టాలని సూచించారు. ఇక్కడి ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో కేసముద్రం రాష్ట్రంలోనే మోడల్ మునిసిపాలిటీగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, ఆ తర్వాత అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వ ఏకపక్ష విధానాలు కాకుండా రాబో యే సంక్షేమ పథకాల్లో గ్రామసభల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేస్తూ పారదర్శకంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ బలరాంనాయక్, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు, మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ, హన్మకొండ ఏసీపీ జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, మోడ్రన్ కబడ్డీ రూపకర్త, ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుంభం రాంరెడ్డి, కార్యదర్శి చెదుపల్లి ఐలయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తేరాల శ్రీనివాస్, కొప్పుల శంకర్, హెచ్ఎం బీ రాజు, పీడీ కొమ్ము రాజేందర్ పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్


కేసముద్రంలో మోడ్రన్ కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



గంగిరెద్దులతో కళాకారులు

బసవన్నలే నేస్తాలు బతుకంతా కష్టాలు!

సండే స్పెషల్ SUNDAY SPECIAL

- ఆదరణ కరువై బాగుపడని గంగిరెద్దుల వారి బతుకులు
- సంక్రాంతి వేళ కానరాని సందడి
- ప్రభుత్వాలు మారుతున్నా అందని కనీస సాయం
- సంచార జీవితంతో బతుకులు అగమ్యగోచరం

రఘునాథపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వచ్చిందంటే ఒకప్పుడు పల్లెలు, పట్టణాల్లో ముగ్గుల లోగిళ్లు.. పతంగుల రెపరెపలు.. హరిదాసు కీర్తలు, గంగిరెద్దుల ఆటపాటలతో పల్లెలు, పట్టణాలలో సందడి కనిపించేది. కానీ రానురాను సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. ఉరుకులపరుగుల జీవితంలో పూర్వరోజుల్లోలా పండుగలను జరుపుకొనేవారే కనిపించడం లేదు. ఇక సంక్రాంతి పండుగలో కీలకమైన బసవన్నలుగా పిలుచుకునే గంగిరెద్దుల విన్యాసాలు కనుమరుగయ్యాయి. ఫలితంగా తరతరాలుగా వాటినే వృత్తిగా నమ్ముకున్న కుటుంబాలు దీనావస్థలో బతుకులీడుస్తున్నాయి. తాత ముత్తాతల నుంచి వస్తున్న గంగిరెద్దులను ఆడించే వృత్తినే జీవనాధారంగా ఎంచుకుని గంగిరెద్దులనే ఆస్తిగా నమ్ముకొని కూటి కోసం కోటి తిప్పలు పడుతున్నారు. సంచార జీవితం కావడంతో ప్రభుత్వాల నుంచి సరైన ఆదరణ లేక, కనీసం ఉండటానికి ఇళ్లు కూడా దీన స్థితిలో ఆయా కుటుంబాలున్నాయి. సంప్రదాయ కళను వృత్తిగా ఎంచుకుని బతుకుతున్న తమను పట్టించుకోవాలని గంగిరెద్దుల వారి కుటుంబాలు విన్నవిస్తున్నాయి.

అనాదిగా వస్తున్న ఆచారం..

దేవతల కాలంలో శివుడిని ఆరాధిస్తూ గంగిరెద్దుల ఆటతో దేవతలను మెప్పించిన వారిగా తమ తాత ముత్తాతల నుంచి ఇదే వృత్తిని చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని జనగామ జిల్లా ఖిలాషాపూర్‌లో నివాసముంటున్న బత్తుల శ్రీను, ఆవుదొడ్డి మహేష్, ఆవుదొడ్డి రాజు చెబుతున్నారు. గంగిరెద్దుల ఆట కోసం పది నెలల నుంచి నాలుగేళ్ల వయస్సు వరకు ఉన్న ఎద్దులను కొనుగోలు చేసి వాటికి నిత్యం పచ్చగడ్డి వేస్తు ఆకు పసర్లతో తమ మాటలను వినేలా తర్ఫీదునిస్తూ తమ కనుగుణంగా గంగిరెద్దులను మలుచుకుంటామంటున్నారు. గుంటూరు, నవాబుపేట, కోదాడ, ఒంగోలు నుంచి రూ.40వేల నుంచి రూ.90 వేల వరకు వెచ్చించి ఎద్దులను కొనుగోలు చేసి మూడు నెలల పాటు వాటికి ప్రత్యేక శిక్షణనిచ్చి ఆటకు సిద్ధం చేస్తామని బత్తుల శ్రీను తెలిపారు.

ఇప్పటికీ దుర్భర జీవితం

సంక్రాంతి వచ్చిందంటే తెల్లవారు జామునే ఇంటింటికి తిరుగుతూ గంగిరెద్దులను ఆడిస్తూ ప్రజల నుంచి ధాన్యం, డబ్బులు స్వీకరించే వీరు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటూ దుర్భర జీవనం సాగిస్తున్నారు. ఏళ్ల గడుస్తున్నా వీరి సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. బతుకు దెరువు కష్టమై కూలీ పనులు చేసుకుంటూ జీవితాలు వెళ్లదీస్తున్నారు. బసవన్నల ఆటలతో అందరిని అలరించే వారి ఇళ్లల్లో సంక్రాంతి సంబరాలు కనుచూపుమేరలో కనిపించడం లేదంటే వారి జీవన పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. బాధలను దిగమింగుతూ బసవన్నల ఆటలతో గ్రామాలలో సంక్రాంతి సంబరాల సందడి చేస్తు పెద్దలు, చిన్నలను అలరింపజేస్తున్న గంగిరెద్దుల కళాకారులు వారికి వారే సాటి అని నిరూపించుకుంటు అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఆదరించే వారు లేక కష్టాలతో సావాసం చేస్తున్నారు.

ఆకట్టుకునేలా అలంకరణ

ఆటకు వెళ్లే ముందు బసవన్నలను అందంగా అలంకరిస్తారు. రంగురంగుల జాకెట్టు ముక్కలు, చీరలతో బొంతను తయారు చేసి బసవన్నలపై కప్పుతారు. అలాగే ఈత చెట్టు కమ్మలతో చాపలు అల్లి వాటిని రంగులతో అందంగా తీర్చిదిద్ది కొమ్ములకు తొడుగుతారు. మెడకు గజ్జెల పట్టి, కాళ్లకు గజ్జెలు కడతారు. ఒక్కో గంగిరెద్దును అలంకరించేందుకు సుమారు రూ.15 వేల వరకు ఖర్చు వస్తుందట. బసవన్నలకు శిక్షణ ఇచ్చేటప్పుడు వాటికి 'అలగడం' కూడా నేర్పిస్తామని, ఆటలు ఆడే సమయాల్లో ఎక్కువ డబ్బుల కోసం అలిగేలా ప్రత్యేక శిక్షణ ఇస్తామని శ్రీను తెలిపారు. గంగిరెద్దు మనిషి ఛాతిపై ఆడడం, గంగిరెద్దు నోట్లో మెడ పెట్టడం, మోకాళ్లపై కూర్చుని నడవడం వంటి ఆటలను కూడా నేర్పిస్తామని చెప్పారు. ఎవరైనా చనిపోతే సమాచారం తెలుసుకుని గంగిరెద్దు విన్యాసాలు చేసి చూపించి డబ్బులు వసూలు చేసుకుంటామని తెలిపారు.

తాతల నుంచి ఇదే పని : బత్తుల శ్రీను



నా చిన్నప్పటి నుంచి గంగిరెద్దులను ఆడిస్తూనే బతుకుతున్న. తాత ముత్తాతల నుంచి మాకు ఇదే వృత్తి ఆచారంగా వత్తాంది. సావు..బతుకులే మాకు బుక్కెడు బువ్వ కల్పిస్తయి. సంక్రాంతి పండుగప్పుడే మా చేతిలో చాలా పైసలు కనిపిస్తయి. పొట్ట కూటి కోసం గంగిరెద్దుతో ఊరూరు తిరుగుతున్నం.

పుట్టెడు కష్టాలు పడుతూ కళను బతికిస్తున్నాం : ఆవుదొడ్డి మహేష్



గంగిరెద్దులను ఆడించే కళను బతికించడానికి పుట్టెడు కష్టాలు పడుతున్నాం. గంగిరెద్దులతో సంచార జీవనం సాగిస్తూ పొట్ట పోసుకుంటున్నాం. ఉండటానికి సొంత ఇల్లు. తినడానికి తిండి. కట్టుకోవడానికి దుస్తులు కూడా కరువయ్యాయి. ఆదరణ కోల్పోతున్న కళకు జీవం పోయడానికి బతుకు భారమవుతున్నా.. కష్టాలకు ఎదురీదుతూ బతుకు పోరు సాగిస్తున్నాం. గంగిరెద్దులు ఆడిస్తే వచ్చే ఆదాయం కుటుంబం పోషించడానికి సరి పోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

బసవన్నల ఆటను బతికిస్తున్నాం : ఆవుదొడ్డి రాజు



బసవన్నల ఆటను బతికించడానికి ఎన్నో కష్టనష్టాలు పడాల్సి వస్తోంది. బసవన్నల ఆటకు ప్రజల ఆదరణ తగ్గడంతో బుక్కెడు బువ్వ కోసం నానా ఇబ్బందులు పడుతున్నాం. తెలంగాణ రాష్ట్రం సాకారమైనంక కూడా మా బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉన్నాయి. ఎవ్వరు మమ్ములను పట్టించుకున్న పాపాన పోలేదు. తెలంగాణ యాస, బసవన్నల ఆటను బతికిస్తున్న మాకు సర్కారు సరైన ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలి.



బట్టల బజార్‌లో సంక్రాంతి నోముల సామగ్రి అమ్మకాలు

ఇంటింటా సంక్రాంతి సందడి

- నోములతో మహిళలకు సౌభాగ్యం
- పూజా సామగ్రి కొనుగోలులో మహిళలు బిజీ

వరంగల్ చౌరస్తా, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడి పంటలతో ధనధాన్యాలతో ఇంటిల్లిపాది ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే పండుగ సంక్రాంతి. సోమవారం భోగి పండుగ, మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను జరుపుకోనున్న నేపథ్యంలో ఇంటింటా సందడి మొదలైంది. మూడు రోజుల పాటుసాగే పర్వదిన వేడుకల్లో భాగంగా మహిళలు సంక్రాంతి రోజున ప్రత్యేక నోములు ఆచరిస్తారు. కలకాలం తాము ముత్తైదువుగా ఉండాలని, పిల్లాపాపలు, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటారు. మరునాడు బంధు మిత్రులను, ఇరుగుపొరుగు వారిని ఆహ్వానించి నోమును వాయినంగా ఇచ్చి ఆశీర్వాదం తీసుకుంటారు.

పూజా సామగ్రికి పెరిగిన గిరాకీ

సంక్రాంతి పర్వదినం వస్తుందంటే మహిళలు నోములు నోచుకోవడానికి ఉపయోగించే పూజా సామగ్రి దుకాణాలు కళకళలాడుతాయి. వరంగల్ బట్టల బజార్, చౌరస్తా, స్టేషన్‌రోడ్డు, పాపయ్యపేట చమన్ ప్రాంతాల్లో ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తారు. ఈసారి పది రోజుల క్రితమే ప్రారంభించారు.

నోముకునే విధానం

తాము కలకాలం ముత్తైదువుగా ఉండాలని వేడుకుంటూ మహిళలు 13 రకాల వస్తువులతో నోముకుంటారు. ప్రధానంగా టిఫిన్ బాక్స్‌ల నుంచి బకెట్లు చిన్నచిన్న స్టీల్ సామానులాంటి 13 రకాల గృహోపకరణాలను కొని వాటిలో పసుపు కుంకుమ, రేగుపండ్లు, నువ్వుల ముద్దలు, పోకలు, గాజులు, చేబియ్యం, కంకణం, రవికబట్టలు అమ్మవారి ముందు పెట్టి మంగళహారతులు పలుకుతారు. మరునాడు 13 మందిని ఇంటికి పిలిచి తల ఒక నోము అందజేసి ఆశీర్వచనం పొందుతారు.

చైనా మాంజాతో పైలం

- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు, వన్య ప్రాణులు
- పోలీసులు చర్యలు చేపట్టినా.. ఆగని విక్రయాలు



పతంగుల దుకాణంలో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న మాంజా దారాలు

జనగామ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ వచ్చిందంటే.. గాలిపటాల రెపరెపలు కనిపిస్తుంటాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ గాలిపటాలను ఎగురవేస్తూ కేరింతలు కొడతుంటారు. అంతేకాదు ఎదుటి వారి గాలిపటాలను తెగ్గొట్టాలన్న తాపత్రయం.. వారిని మించి ఎగురవేయాలన్న పట్టుదలతో ప్రమాదకర చైనా మాంజాను వాడుతున్నారు. దాంతో సంతోషాన్ని నింపాల్సిన పతంగులు విషాదాన్ని మిగుల్చుతున్నాయి. అత్యంత పదునుగా, బలంగా ఉండే చైనా మాంజా మనుషులకే కాదు, జంతువులు, పక్షులకు కూడా ముప్పు తెస్తోంది. చైనా మాంజాతో ప్రమాదాలు జరుగుతున్నాయని 2016లో ప్రభుత్వం విక్రయాలను నిషేధించింది. అయినా గుట్టుచప్పుడు కాకుండా మాంజా విక్రయిస్తున్నారు. ఈ విషయమై పోలీసులు రంగంలోకి దిగి చర్యలు చేపడుతున్నా పరిస్థితి మారడం లేదు. కొంత మంది వ్యాపారులు కాసుల కోసం కక్కుర్తి పడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అధిక ధరలకు చైనా మాంజా విక్రయిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. గాలిపటాల పోటీలో తెగిపడిన దారాలు చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలకు, భవనాలపై పడుతున్నాయి. వాహనాలపై వేగంగా వెళ్తున్న వారికి మాంజా తగిలి గాయపడుతున్నారు. సన్నగా, దృఢంగా ఉండే ఈ దారాన్ని చేతులతో, పళ్లతో తెంచే ప్రయత్నం చేస్తే ప్రమాదమే.

ఉమ్మడి జిల్లాలో పలు సంఘటనలు

చైనా మాంజాలో ప్రమాదకర గాజు పొడి, అల్యూమినియం ఆక్సైడ్‌తో పాటు గట్టితనం కోసం సింథటిక్ ఫైబర్ కలుపుతారు. దీంతో ఈ మాంజా తగిలితే చర్మం కోసుకుపోతుంది. వారం రోజుల క్రితం జనగామ పట్టణంలో చైనా మాంజా తగిలి కొందరు పిల్లలు, యువకులు గాయపడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో సైతం ఇలాంటి ఘటనలు జరిగాయి. జనగామ జిల్లాలోని బచ్చన్నపేటకు చెందిన ఎస్.సనత్‌కుమార్, సాయిరాం, సాయికుమార్ జనగామలోని సిద్దిపేట రోడ్డు వైపు వంతెనపై ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గాలిపటానికి చెందిన మాంజా దారం తగలడంతో సనత్‌కుమార్ గొంతుకు తీవ్ర గాయమైంది. సాయిరాం, సాయికుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. మరో ద్విచక్రవాహనం పై తల్లిదండ్రులతో కలిసి ప్రయాణిస్తున్న పదేళ్ల బాలుడు వీక్షిత్‌కు గొంతు భాగంలో దారం తగలడంతో తీవ్ర గాయమైంది. నిషేధిత మాంజా దారాల విక్రయాలపై అటవీ, పోలీసు శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధిత కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

మాంజా విక్రయాలు చేపడితే చర్యలు

దామోదర్‌రెడ్డి, సీఐ, జనగామ



సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో పతంగులు విక్రయాలు చేసేవారు నిబంధనలు పాటించాలి. చైనా మాంజా విక్రయాల నేపథ్యంలో ఇప్పటికే పలు షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశాం. అత్యంత ప్రమాదకరంగా మారిన చైనా మాంజాను విక్రయించొద్దు. ఎవరైనా విక్రయిస్తున్నట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

జైలు శిక్ష, జరిమానా



ప్రమాదానికి గురైన సనత్‌కుమార్ (ఫైల్)

చైనా మాంజాతో పొంచి ఉన్న ముప్పును గ్రహించే రాష్ట్ర ప్రభుత్వం 2016లో వీటి విక్రయాలపై నిషేధం విధించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం-1986 ప్రకారం చైనా మాంజాను కొనుగోలు చేసినా, విక్రయించినా నేరంగా పరిగణిస్తారు. దీనిని ఉల్లంఘించిన వారికి ఐదేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారు. జంతువులు, పక్షులకు హాని కలిగిస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం 3 నుంచి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా ఉంటుందని పోలీసులు తెలిపారు.



గాయపడిన వీక్షిత్ (ఫైల్)

ఇటీవల జరుగుతున్న ప్రమాదాలతో పోలీసులు మాంజా విక్రయాలపై కన్నేసారు. పతంగుల దుకాణాలపై విస్తృతంగా మూకుమ్మడి దాడులు చేపట్టారు. చైనా మాంజాను విక్రయిస్తున్న వారిపై చర్యలు చేపట్టారు. అయినా చాటుమాటుగా చైనా మాంజా విక్రయాలు జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి.

భవితకు దిక్సూచిగా ఎన్‌వైకే

- యువత భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు
- నేడు ఇండోర్ స్టేడియంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం



ఎన్‌వైకే ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం (ఫైల్)

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేయడానికి ఉద్దేశించిన నెహ్రూ యువ కేంద్ర (ఎన్‌వైకే).. ఆ దిశగా పలు కార్యక్రమాలను చేపడుతోంది. హనుమకొండ బాలసముద్రంలోని ఈ కేంద్రం యేడాదిగా నిర్వహించిన అనేక సామాజిక, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో యువతీ, యువకులు, యువజన సంఘాల సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు, నేడు వివేకానంద జయతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న జాతీయ యువజన దినోత్సవం నేపథ్యంలో ఎన్‌వైకే కార్యకలాపాలపై కథనం

ట్రాఫిక్

పర్వదినాల రోజు పట్టణాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని నెహ్రూయువ కేంద్ర సరిగ్గా దీపావళి పండుగ రోజు ట్రాఫిక్ అవగాహన ట్రాఫిక్ పోలీసులకు సహాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఎన్‌వైకే ఆధ్వర్యంలో పలువురు యువతీ యువకులు దీపావళి రోజు ఉదయం 8 గంటలకే రోడ్లమీదికి వచ్చి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసులకు స్వచ్ఛందంగా సాయపడ్డారు. పనిలో పనిగా ట్రాఫిక్ రూల్స్ రాసిన, వాహనాలను నడిపేప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు రాసిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ వాహనదారులకు, సామాన్య ప్రజలకు అవగాహన కలిగించారు.

ఆస్పత్రుల్లో స్వచ్ఛత

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, బయోవ్యర్థాలు, మరుగుదొడ్ల నుంచి వెలువడే దుర్వాసనను దృష్టిలో పట్టుకొని ఎన్‌వైకే పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. ఆస్పత్రులను ఊడ్చి శుభ్రం చేశారు. రోగలకు ఆహారం, మందులు అందించడం, వైద్య పరీక్షల కోసం వీల్‌చైర్లు, స్ట్రెచర్లపై రోగులకు ల్యాబ్‌ల వద్దకు తీసుకువెళ్లడం వంటి పనులు చేశారు.

మార్కెట్లు శుభ్రం

నగరంలోని కూరగాయాల మార్కెట్‌లలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. పారపోసిన కుళ్లిపోయిన, పుచ్చులున్న కూరగాయాలను, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని యువతీ యువకులు శుభ్రం చేశారు. మార్కెట్లను ఊడ్చి చెత్తను తొలగించి వాటిని శుభ్రం చేశారు. మార్కెట్లతో పాటు వేయిస్తంభాల గుడి, ఇతర ప్రార్థనా స్థలాలను సైతం పరిశుభ్రం చేశారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

మాదక ద్రవ్యాలపై ఎన్‌వైకే అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. పోలీసు అధికారులతో కౌన్సెలింగ్ ఇప్పిచ్చింది. ఇందులో భాగంగా ఇటీవల బొల్లికుంటలోని వాగ్దేవి కాలేజీలో డ్రగ్స్‌వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై నిర్వహించిన సదస్సులో ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో పాటు పోలీసు ఉన్నతాధికారుల పాల్గొన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఎన్‌కేవై ఆధ్వర్యంలో యువతీ యువకులతో పెద్ద ఎత్తున ర్యాలీలను నిర్వహించారు.

క్రీడా పోటీలు

నెహ్రూ యువ కేంద్ర బ్లాక్ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యికిపైగా యువజన సంఘాలు ఉన్నాయి. ఈ ఆటల పోటీల నిర్వహణ బాధ్యతను వాటికే అప్పగించడం ద్వారా వాటిని క్రియాశీలం చేస్తోంది. గ్రామస్థాయిలో సామాజిక రుగ్మతలపై యువతతో సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహిస్తోంది.

మై భారత్‌తో అనుసంధానం

వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, యువత సాధికారతను ప్రోత్సహించే వర్క్‌షాపుల నిర్వహణను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మైభారత్ పోర్టల్‌తో అనుసంధానం చేశారు. పోర్టల్ భాగస్వామ్యంతోనూ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మైభారత్‌లో యువత క్రియాశీల భూమిక పోషించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం యూత్ క్లబ్‌ల ఏర్పాటు, వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సంక్లిష్టంగా మార డంతో యూత్ క్లబ్‌లూ వలంటీర్లను ప్రోత్సహిస్తున్నారు.

నేడు యువజనోత్సవం

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు నెహ్రూయువ కేంద్ర కోఆర్డినేటర్ అన్వేష్ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 12వ తేదీన జేఎన్‌ఎస్ స్టేడియంకు ఎదురుగా గల ఇండోర్ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో యూత్ అవార్డులు పొందినవారిని సత్కరించనున్నామన్నారు. అంతేకాకుండా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి ఇవ్వనున్న సందేశాన్ని డిజిటల్ స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు చెప్పారు. ఈనెల 12 నుంచి 19వ తేదీ వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అంశాలపై యువజనోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

జయహో 'యువత'

సామాజిక బాధ్యతగా పలు అంశాల్లో సేవలు

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే యువత అన్ని రంగాల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ మన భారత్ (మైభారత్) పేరిట పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. తమ పరిధులను విస్తృతం చేసుకోవాలని, తమ జీవితంలో మార్పు తీసుకురావాలని, తమ కలలవైపు నడిచేలా అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని కాంక్షించే యువతకు మై భారత్ ఒక ప్లాట్‌ఫారమ్. యువతకు వివిధ స్వయం సేవకంగా, అనుభవపూర్వకంగా నేర్చుకోవడానికి, నైపుణ్యాన్ని ఏర్పరచుకోవడానికి, కమ్యూనిటీలలో సానుకూల ప్రభావాన్ని సృష్టించడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని మై భారత్ పోర్టల్ కల్పిస్తుంది. నేడు స్వామివివేకానంద జయంతి. ఈ రోజును జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని యువతీ యువకుల అవగాహన కోసం మైభారత్ పోర్టల్‌పై కథనం.

యువతకు భాగస్వామ్యం

మైభారత్ పోర్టల్‌లో 15 ఏళ్ల నుంచి 29 ఏళ్లలోపు యువతీ యువకులకు కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం కల్పించింది. ఈ పోర్టల్‌లో చేరిన యువతను అభివృద్ధివైపు మళ్లించడం, సాధికారత సాధించేలా చేయూతనివ్వడంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంచేందుకు గత ఏడాది అక్టోబరు 31న ప్రధాని నరేంద్ర మోదీ ఈ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ-లర్నింగ్ పోర్టల్ ద్వారా వివిధ రకాల అంశాలకు సంబంధించి తర్ఫీదు ఇస్తున్నారు. దేశవ్యాప్తంగా విద్య, ఉద్యోగ అవకాశాలు, పలు రకాల కోర్సులు, సంబంధిత అంశాలపై ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తున్నారు. ఆన్‌లైన్ వేదికగా నైపుణ్య సమాచారం ఈ పోర్టల్ ద్వారా లభ్యమవుతుంది.

లక్ష్యాలు

డిగ్రీలు చేతపట్టుకున్న యువత ఉద్యోగవేటలో అలసిపోతున్నారు. నైపుణ్యం ఉన్నప్పటికీ ప్రోత్సాహం కరువైంది. ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నా పొందలేకపోతున్నారు. ఆర్థిక స్తోమత లేక పరిశ్రమలు స్థాపించడంలో ఔత్సాహికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాదు.. ప్రైవేటులో నిలదొక్కుకునేందుకు మై భారత్ పోర్టల్ వేదిక అవుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఇతర ఉన్నత విద్య చదువుతున్న వారి ప్రతిభ ఆధారంగా ఉపాధి పొందేందుకు మార్గనిర్దేశనం చేయనున్నారు.

అనుసంధానం

మై భారత్ పోర్టల్‌ను నాలుగు అంశాలతో అనుసంధానం చేశారు. ఒకటి - ప్రభుత్వ పరంగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై అవగాహన. వీటిని వినియోగించుకునేందుకు అర్హతలను ఈ పోర్టల్ ద్వారా వివరిస్తారు. రెండోది - ఎంచుకున్న రంగంలో ప్రతిభా నైపుణ్యాలు పెంపొందించుకునే అవకాశాలు, నైపుణ్య సాధనకు అందుబాటులో ఉన్నవాటిపై అవగాహన కల్పించడం. మూడోది - సామాజిక బాధ్యతను చేర్చి యువత ఉజ్వల భవితకు బాటలు వేసే సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాలు అమలు చేయడం. నాలుగోది - వ్యాపారంలో రాణించేలా యువతను ప్రోత్సహించడం. వ్యాపారాన్ని ప్రారంభించేందుకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ)లో రాయితీ, ఎలా రుణం పొందాలో ఈ పోర్టల్‌లో ఉంటుంది. వ్యాపార, పారిశ్రామికవేత్తలతోనూ మాట్లాడే అవకాశం కల్పించి సందేహాలను నివృత్తి చేయడం.

చేయూతనిచ్చే మై భారత్

- నాలుగు అంశాలతో అనుసంధానం
- విభిన్న రంగాల్లో రాణించేలా ప్రోత్సాహం


నేడు జాతీయ యువజన దినోత్సవం

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా..

యువతీ, యువకులు స్వయం ఉపాధికి సంబంధించిన సమాచారం పొందాలంటే ప్లే స్టోర్‌లోకి వెళ్లి మై భారత్ పోర్ట ల్‌లో చేరేందుకు లాగిన్ కావాలి. పుట్టినరోజు, నెల, సంవత్సరం, రాష్ట్రం, జల్లా, గ్రామం, పట్టణం ఇలా సమాచారం నమోదు చేయాలి. తర్వాత ఈ-మెయిల్ ఐడీతో పాటు ఎస్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఎన్‌వైకే, ఇతరులు ఇలా ఏ కేటగిరిలో ఉన్నారో దాన్ని క్లిక్ చేయాలి. 15-29 ఏళ్ల లోపు యువత దీనిలో సభ్యత్వం తీసుకునే వెసులుబాటు కల్పించారు.

నమోదు వివరాలు

మై పోర్టల్‌లో విద్యావంతులైన నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. ఈ పోర్టల్‌లో భాగస్వామ్యం కావడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 68,042 మంది యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో హనుమకొండ జిల్లాలో 15,959 మంది, వరంగల్ జిల్లాలో 13,669, జనగామ జిల్లాలో 11,066, మహబూబాబాద్ జిల్లాలో 9,599, ములుగు జిల్లాలో 8,150, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 9,599 మంది నమోదయ్యారు.



వాహనదారులు నిబంధనలు పాటించాలి

● పలు మండలాల్లో పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు ● వాహనదారులకు పలు సూచనలు ● అవగాహన ర్యాలీలు

ములుగు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తూ ములుగు పోలీసులు శనివారం ర్యాలీ నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని డీఎల్ఆర్ గార్డెన్స్ నుంచి జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనదారులతో ప్రదర్శన నిర్వహించారు. కొందరు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. హెల్మెట్లు కొనిపించారు. మోటార్ సైకిళ్లు నడిపేవారు ఖచ్చితంగా శిరస్త్రానాలు ధరించాలని ఎస్సై(ఎస్‌హెచ్‌వో) వెంకటేశ్వర్‌రావు సూచించారు. అతివేగం, రాంగ్‌రూట్ ప్రయాణం అత్యంత ప్రమాదకరమైందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు లక్ష్మారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు : రోడ్డు ప్రమాదాలపై వాజేడు ఎస్సై శనివారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ఆయన భూపాలపట్నం-హైదరబాద్ 163వ జాతీయ రహదారి జగన్నాథపురం వద్ద రోడ్డు భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, జాతీయ రహదారి విస్తరణ కాంట్రాక్టరు సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట : రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా శనివారం మండలంలో స్థానిక ఎస్సై టీవీఆర్. సూరి ఆధ్వర్యంలో అన్ని గ్రామాలకు సంబంధించిన ఆటో డ్రైవర్లతో కమలాపురం నుంచి ములుగు జిల్లా సరిహద్దు గ్రామమైన బ్రాహ్మణపల్లి ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వరకు అవగాహన ర్యాలీలో చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు పలు రకాల నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మంగపేట ప్రొబేషనరి ఎస్సైలు సురేష్, శ్రీకాంత్, మహేష్, సివిల్, సీఆర్పీఎఫ్, పోలీసులతో పాటు ఆటో డ్రైవర్లు, ఆటో యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శిలు పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్సై బి.అశోక్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం మండలకేంద్రంలోని చౌరస్తాలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు



ములుగులో అవగాహన ర్యాలీ తీస్తున్న పోలీసులు

కార్యక్రమంలో రోడ్డు రవాణశాఖ సిబ్బంది సుందర్‌నాయక్, ఏఎస్సై రాజేశం, పోలీస్ సిబ్బంది సారంగపాణి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు రూ.25 కోట్లు

మహదేవపూర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర త్రివేణి సంగమ గోదావరిలో మే 15 నుంచి 12 రోజుల పాటు సరస్వతి పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆలయ అభివృద్ధి ప నుల కోసం రూ.25 కోట్లు పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరైనట్లు ఆలయ ఈవో మారుతి తెలిపారు. ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌తో పాటు జిల్లా కలెక్టర్లు, మంత్రులు సమావేశాలు నిర్వహించి ఆలయ అభివృద్ధిపై ప్రణాళిక సిద్ధం చేశారు. అధికారుల ప్రతిపాదన మేరకు రూ .25 కోట్లు మంజూరైనట్లు ఆలయ నిర్వహణాధికారులు తెలిపారు.

లోయర్ పరీక్షకు 98 మంది హాజరు

భూపాలపల్లిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 98 మంది మాత్రమే హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. లోయర్ డ్రాయింగ్ పరీక్షకు 148 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 98 మంది మాత్రవే హాజరైనట్లు తెలిపారు. అలాగే డ్రాయింగ్ హైయ్యర్ విభాగంలో 58 మంది దరఖాస్తు చేసుకోగా 45 మంది హాజరయ్యారని తెలిపారు. ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షకు 16 మంది హాజరైనట్లు తెలిపారు. మొత్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు

కాకతీయఖని, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బందికి భూపాలపల్లి డిపోలో అధికారులు శనివారం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. డ్రైవర్లు, కండక్టర్లు, ట్రాఫిక్ గైడ్స్, సూపర్ వైజర్లు 180 మందికి అన్నం ప్యాకెట్లను ఆర్టీసీ అధికారి జీఆర్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు

మల్హర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలో రోడ్డుపై ప్రమాదకరంగా నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలను విద్యుత్ అధికారులు తొలగించారు. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలను అధికారుల ఆదేశాల మేరకు తొలగించినట్లు జేఎల్ఎమ్ మహేందర్ తెలిపారు. నిరుపయోగంగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్థంబాల తొలగింపు పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి వీరభద్రస్వామి ఆరాధన మహోత్సవం

ఏటూరునాగారం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో కొలువుదీరిన అభినవ వీరభద్ర స్వామి దేవాలయంలో రెండు రోజుల పాటు ఆరాధన మహోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. నేడు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఎదురుకోలు, విఘ్నేశ్వరుడి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ పూజ కార్యక్రమాలు జరగనున్నట్లు ఆలయ చైర్మన్ బల్ల వీరభద్రయ్య తెలిపారు. 13వ తేదీన (సోమవారం) ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు భద్రకాళి అమ్మవారికి కుంకుమార్చన, ఒడిబాల బియ్యం, స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, మహానివేదన, మంత్రపుష్పం జరుగుతాయి అన్నారు. అనంతరం 11 గంటల నుంచి స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు, మధ్యాహ్నం 1 గంటల నుంచి మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మహదేవపూర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దస్తర్ కాలనీకి చెందిన నేత కార్మికులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు దస్తరికాలనీలోని వారి కార్యాలయంలో క్షీరాభిషేకం చేశారు. చేనేత అభయహస్తం, నూతన భరోసా నేతన్న బీమా ఈ మూడు పథకాలను చేనేత కార్మికులకు అమలు చేసినందుకు ఈ సందర్భంగా పాలాభిషేకం చేశారు. చేనేత కార్మిక అధ్యక్షులు గొర్రె బాపన్న ఆధవర్యంఓద ఆదాపు నేత కార్మికులు 50 మంది పాల్గొన్నారు.

● టేకుమట్ల : మండల కేంద్రంలో శనివారం చేనేత సహకార సంఘం మండల అధ్యక్షుడు మాచర్ల మహేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాగా ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఆడెపు సంపత్ ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. చేనేత సంఘం మండల నాయకులు,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వర దేవస్థాన క్యాలెండర్ ఆవిష్కరణ

మహదేవపూర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థాన క్యాలెండర్‌ను శనివారం తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బబు హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యార్, కమిషనర్ ఇ.శ్రీధర్, ఆర్‌జేసీ రామకృష్ణారావు, జయశంకర్ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎ.మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు పనకంటి ఫణీంద్రశర్మ పాల్గొన్నారు.

ముగిసిన నాపాక బ్రహ్మోత్సవాలు

చిట్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నైన్‌పాక గ్రామంలో నాపాక సర్వతోభద్ర ఆలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. గత మూడు రోజులుగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. చివరిరోజు బండ్లు తిరుగుట, స్వామివారికి నవధాన్యం సమర్పించుట, ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నాపాక ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనవెంట ఆలయ కమిటీ చైర్మన్ యాదండ్ల రాజయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవీ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి మధువంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

పంట కాపలాకు వెళ్లిన యువకుడికి అస్వస్థత

ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి



పవన్‌కళ్యాణ్(ఫైల్)

మేడారం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటచేను వద్ద కాపలాకు వెళ్లి యువకుడు అస్వస్థతకు గురయ్యాడు. ఈ క్రమంలో గమనించిన కుటుంబ సభ్యులు ప్రథమ చికిత్స నిమిత్తం ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకు వెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏటూరునాగారం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్వాయి మండలం పంబాపూర్‌కు చెందిన ఎల్లబోయిన భిక్షపతి జయ దంపతుల కుమారుడు పవన్ కల్యాణ్(25) వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి 11గంటల సమయంలో అడవి జంతువుల నుంచి పంట రక్షణకు కావలికి వెళ్లాడు. మరుసటి రోజు శుక్రవారం ఉదయం ఇంటికి రాకపోవడంతో తల్లి ఎల్లబోయిన జయ చేను వద్దకు వెళ్లి చూడగా పవన్ కళ్యాణ్ చేతులు, కాళ్ళు బిగుసుకుపోయి ఉన్నాయి. వెంటనే అతడికి నీరు తాగించి నిరసంగా ఉన్నాడని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స చేస్తున్న క్రమంలో మెరుగైన వైద్యం కోసం ఏటూర్‌నాగారం తీసుకువెళు తుండగా మార్గమధ్యలో పవన్ కళ్యాణ్ మృతి చెందాడు. కాగా శుక్రవారం రాత్రి మృతుడి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆర్ఎంపీ ఇంటి ఎదుట బైఠాయిచి నిరసనకు, ధర్నా చేశారని తెలిపారు. ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించడం వల్లే పవన్‌కళ్యాణ్ మృతి చెందాడని ఆందోళన చేశారు. సమాచారం తెలుకున్న పోలీసులు గొడవను సద్దుమణిగించారు. వైద్యం వికటించిందా లేదా అనేది తెలియాల్సి ఉంది. శనివారం మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం తరలించామని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

-భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి సొంతింటి ఇంటికల నెరవేరుస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. అనంతరం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలకు చెందిన 23మంది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు 23,02,668ం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని అన్నారు. ఐదు లక్షలతో ఇంటి నిర్మాణం అవుతుందా లేదా అనే అనుమానం నివృత్తి చేయడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి మోడల్ ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. 400చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ముగ్గు పోసిన రోజు నుంచి 20రోజుల్లోనే పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, కోటంచ ఆలయియ చైర్మన్ భిక్షపతి, నాయకులు ఎడ్ల మల్లారెడ్డి, శంకరయ్య, నాంసాని రాంబాబు, వీరబ్రహ్మం, ఏనుగు రవిందర్‌రెడ్డి, ముద్దమల్ల రఘు, సురేందర్‌రెడ్డిపాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

మొగుళ్లపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఆర్‌డీఏ అదనపు పీడీ మంజులాదేవి హెచ్చరించారు. శనివారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన 15వ విడత సామాజిక ప్రజావేదిక రెండోరోజు ముగిసింది. మండలవ్యాప్తంగా 25గ్రామపంచాయతీల్లో జరిగిన పనులను సామాజిక బృందం తనిఖీ చేసింది. కాగా, సంబంధించిన వివరాలను గ్రామాలవారీగా ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన అక్రమాలు, రికార్డుల్లో జరిగిన పొరపాట్లను డీఆర్పీలు సభలో వెల్లడించారు. దీంతో గ్రామపంచాయతీల్లో జరిగిన అవకతవ కలను పరిగణలోకి తీసుకుని అదనంగా చెల్లింపులు జరిగాయి. రూ.3లక్షల వరకు ఈజీఎస్ సిబ్బంది అవకతవలకు పాల్పడ్డారని, వాటిని రికవరీ చేయాలని ఏపీడీ మంజులాదేవి అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో హుస్సేన్, క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరమ్‌సింగ్, ఇన్‌చార్జి ఏపీఎం హలీం, ఈసీ కిరణ్, టెక్నికల్ అసిస్టెంట్ రాములు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

మహాముత్తారం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి(పిపి) ములుగుపల్లి గ్రామాల మధ్య ఈ నెల 8వ తేదిన ద్విచక్ర వాహనానికి అడవి పంది అడ్డురావండతో వాహనం అదుపు తప్పి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో స్తంభంపల్లి(పిపి) గ్రామానికి చెందిన జాడి ముత్తయ్యకు తీవ్ర గాయాలు కాగా, యామన్‌పల్లి గ్రామానికి రత్నం రఘుకు గాయలయ్యాయి. ఇరువురు ఆసుపత్రిలో చికత్స పొందారు. తమను అడవిశాఖ అధికారులు ఆదుకొని నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

కలెక్టరేట్‌లో వడ్డే ఓబన్న జయంతి



ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రేనాటి వీరుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు కలెక్టరేట్‌లో ఘనంగా జరిగాయి. శనివారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డే ఓబన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రేనాటి వీరుడు వడ్డే ఓబన్న చరిత్ర నేటి తరాలకు తెలియాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలుగువారి ఆత్మగౌరవ నిలపడం కోసం వీరోచితంగా ఓబన్న పోరాడాన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి శైలజా తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి

మహాముత్తారం, జనవరి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాముత్తారం జీపీ పరిధిలోని దొబ్బలపాడు, దౌతుపల్లి గ్రామాలను కలిపి నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు రుబిన్ మంత్రి శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో గ్రామస్తులతో కలసి మంత్రి శ్రీధర్‌బాబును కలసి గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని విన్నవించారు.

హేమాచల క్షేత్రంలో మొక్కుల వెల్లువ

మంగపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మిన ర్సింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా చింతామణి జలధారల వద్ద చన్నీటి పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయస్వామి, పంచముఖాంజనేయస్వామి, వేణుగోపాలస్వామి, రమ సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. తదనంతరం కొండపై కొలువై ఉన్న స్వయాంభుపుట్టుస్వామిగా విరాజిల్లుతున్న లక్ష్మీనర్సింహస్వామిని, పక్కపక్కనే కొలువై ఉన్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకొని, శ్రీ స్వామివారిని దర్శించు కున్నారు. ఆలయ ప్రదానార్చకులు కైంకైర్యం రాఘావాచార్యులు, ముక్కమ ల్ల రాజవేఖరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పవన్‌కుమారచార్యులు, ఏడునూ తల ఈశ్వర్‌చంద్‌శర్మ, వెంకట నారాయణశర్మ, అనిపెద్ది మురళికృష్ణశర్మలు స్వామివారి మూల విరాట్‌కు తిలా, తైలాభిషేకాలు చేసి పట్టువస్త్రాలు, గజమాలలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

భక్తుల ప్రత్యేక పూజలు, నగర సంకీర్తన



బోరునర్సాపురంలో జరిగిన నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

మంగపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మార్గశిర. ధనుర్మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో వెలిసియున్న శ్రీ సీతారామాచంద్రస్వామి ఆలయాలలతో పాటు వివిధ దేవాలయాలల్లో భక్తులు ఉత్తర ద్వారా దర్శనాలు శుక్రవారం జరిగిన తర్వాత, అర్చక, పూజారులు ఆయా దేవాలయాలల్లో శనివారం ఉదయం ప్రాతఃకాల పూజలను చేసి, అర్చన, అబిషేకాలను చేసి, సామూహిక కుంకుమార్చనలు చేసి భక్తులు దైవ దర్శనాలను చేసుకున్నారు. అర్చకులు భక్తులతో పూజలు చేయించి వివద వ్రతాలను చేసుకున్నారు. అనంతరం మండలంలోని కమలాపురం, బోరునర్సాపురం, చెరుపల్లి, తిమ్మంపేట, మల్లూరు, రాజుపేట, అకినేపల్లి- మల్లారం తదితర గ్రామాల్లో గల శ్రీ సీతారామాంజనేయాస్వామి దేవాలయాలల్లో భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థ, ప్రసాదాలను అంధజేశారు. కార్యక్రమాలలో అర్చక, ఉద్యోగులు, కమిటీలు, సభ్యులు వివిద వర్గాల ప్రజలు పాల్గోన్నారు.

మండలంలో ఊపందుకున్న వరి నాట్లు

మల్హర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : మండలంలో వరి నాట్లు ఊపందుకున్నాయి. గత నాలుగు రోజుల నుంచి వరి నాట్లు వేయడానికి కూలీలు ఉదయం 7 గంటలకే పొలం వద్దక చేరుకొని రాత్రి 8 గం.లకు వస్తున్నారు. గుత్త కైకిల్ల వల్ల రోజుకు గత నాల్గు రోజుల నుంచి రూ వెయ్యి నుంచి పదిహేను వందల వరకు వస్తున్నట్లు మహిళ కూలీలు తెలుపుతున్నారు. మిగిలిన వారు కూడ పనులకు వెళ్లడంతో గ్రామాలు తొమ్మిది తర్వాత నిర్మానుష్యంగా మారుతున్నాయి. వరి నాట్ల వల్ల పండుగ వాతావరణం గ్రామంలో కనిపించడం లేదు. మండల వ్యాప్తంగా యాసంగిలో సుమారు 11 వేల ఎకరాల వరి సాగువుతుందని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధం కావాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధం కావాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మండల అధ్యక్షులు కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలుంటే పరిష్కరించాలని, పార్టీ కోసం పనిచేసేవారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని అన్నారు. మంత్రి సీతక్క ఆదేశాలు పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయడం కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని, అధిష్టానం అనుమతి లేకుండా ఎలాంటి ప్రెస్‌మీట్‌లు పెట్టవద్దని తెలిపారు.

పండుగ వేళ ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

గోవిందరావుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలకు సెలవులు రావడంతో చాలామంది ప్రయాణాలు చేస్తారని, ఈ సమయంలో అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పస్రా ఎస్సై కమలాకర్ శనివారం ఒక ప్రకటనలో పలు సూచనలు చేశారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకుఅన్ని చర్యలు చేపట్టామని, రాత్రివేళల్లో వీధుల్లో గస్తీని ముమ్మరం చేశామని అన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ముందస్తుగా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని, కాలనీ వారు కమిటీలు వేసుకుని వాచ్‌మెన్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలు నిర్వహించు కోవాలని, కొత్త వ్యక్తుల కదలికలపై దృష్టిసారిస్తూ డయల్ 100కు సమాచారమివ్వాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం..

గోవిందరావుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ నాయకులు సత్తా చాటాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శనివారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింత క్రాంతి అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడానికి యూత్ కాంగ్రెస్ నాయకులు ఎంతో కృషి చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఉత్సాహం నింపాలన్నారు.యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, నియోజకవర్గ అధ్యక్షుడు సుమన్‌రెడ్డి, నాయకులు పెండెం శ్రీకాంత్, గొంది కిరణ్, చాపల కిషన్‌రెడ్డి, కోరం రామ్మోహన్, రణదీప్, గుండె శరత్, మణిచంద్, వికాస్ పాల్గొన్నారు.

ఆదివాసీలు ప్రజా ఉద్యమాలు చేపట్టాలి

గోవిందరావుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చట్టాలు, హక్కులు, సమస్యల సాధన కోసం ఆదివాసీలు ప్రజా ఉద్యమాలు చేపట్టాలని గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దబోయిన రవి శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ఏర్పడి 75 ఏళ్లు కావస్తున్నా ఏజెన్సీలో గిరిజన చట్టాలు అమలుకాకపోవడానికి ప్రధాన కారణం రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు తప్పులు చేయడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. మద్యం దుకాణలు, ఇసుకరీచ్‌ల దందా, భూముల వ్యాపారాలు విపరీతంగా పెరిగిపోయాయని, ఇందుకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, డీపీవోలు చర్యలు తీసుకోకపోవడమేనని అన్నారు. ఆదివాసీలు ప్రజా ఉద్యమాలు చేపట్టడానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.ఇస్సార్‌ఖాన్ అన్నారు. శనివారం ములుగులో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుక్కల నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇస్సార్‌ఖాన్ పాల్గొని మాట్లాడారు. సమావేశంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి, నాయకులు జక్కుల రేవంత్, నేపాల్ రావు, అన్వేష్, వంశీకృష్ణ, శ్రావణ్, బండి మధు, బానోత్ లక్‌పతి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెడ్లు మృత్యువాత

వెంకటాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై రెండు దుక్కిటెడ్లు మృతిచెందిన సంఘటన మండలంలోని కేశవాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. స్థానిక ఎస్సై జక్కుల సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని పల్లవేని రవి ఉదయం 5.30గంటల సమయంలో ఎడ్లబండి కట్టుకుని వరిగడ్డి తీసుకొచ్చేందుకు గ్రామశివారులోని బుచ్చికుంట వద్దకు బయలుదేరాడు. ఈక్రమంలో గ్రామానికి చెందిన రైతు లింగంపల్లి కేశవరావు తన పంటను వన్యప్రాణుల నుంచి కాపాడుకునేందుకు అమర్చిన విద్యుత్ తీగలకు ఎడ్లు తగిలి మృతిచెందాయి. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మెయింటనెన్స్ చార్జీలు పెంచితేనే మేలు

కాకతీయఖని, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కోల్ ట్రాన్స్‌పోర్టర్లు మెయింటనెన్స్ చార్జీలు పెంచాలని లేని పక్షంలో నిరసన విరమించబోమని ది కాకతీయఖని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాల్‌చంద్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒక సారి మెయింటనెన్స్ చార్జీలు పెంచేలా కోల్ ట్రాన్స్‌పోర్టర్లకు, తమకు ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం చివరి గడువు ముగిసినప్పటికీ వారు చార్జీలు పెంచక పోవడంతో విషయమై లారీల యజమానులం అంతా కలిసి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జీఎం రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించి కోల్ ట్రాన్స్ పోర్టర్లతో చర్చలు జరిపి సమస్య త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం అవసరం

కాటారం, జనవరి11(ఆంధ్రజ్యోతి): దేశంలో జర్నలిస్టుల భద్రత రోజు రోజుకు దిగజారిపోతున్నతని ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, రదండి దేవెందర్లులు అన్నారు. శనివారం కాటారం విలేకరులతో మాట్లాడుతూ పత్రిక స్వేచ్ఛకు భంగం కల్గుతున్నదని, జర్నలిస్టులు నిజాన్ని నిర్భయంగా రాయలేని పరిస్థితి నేడు ఉన్నదని అన్నారు. ప్రజాసంఘం నాయకులు గట్టయ్య, రాజయ్య, బిక్షపతి, లక్ష్మినారయణ, యుగేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు

వాజేడు, జనవరి 11: భూపాలపట్నం-హైదరబాద్ 163వ జాతీయ రహదారి జగన్నాథపురం వద్ద శనివారం వాజేడు ఎస్సై రాజ్‌కుమార్ ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు రాష్ట్రం చత్తీస్‌గడ్‌లో ఇటివల వరుసగా మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు పోలీసులు అప్రమత్తం అవుతున్నారు. ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న మావోయిస్టులు రాష్ట్రంలోకి ప్రవేశించకుండా సరిహద్దు అడవులను జల్లెడ పడుతున్నారు. ప్రయాణికుల వివరాలను తెలుసుకుంటూ తనిఖీలు చేస్తున్నారు.

అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాద్యాయ అన్నారు. మండలంలోని తిప్పాపురం గ్రామంలో శనివారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ గ్రామస్థులను సమావేశపరిచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనుమాని వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు గ్రామంలో వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, యువత చదువు, క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. అనంతరం గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ డీఎస్పీ సతీష్, వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ నేతృత్వంలో పోలీసుల నాకాబందీ

కాటారం : మండలంలోని కాటారం-మంథని ప్రధాన రహదారిపై పోలీసులు శనివారం రాత్రి పటిష్ట నాకాబందీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో సీఐ నాగార్జునరావు, కాటారం, కొయ్యూరు ఎస్సైలు అభినవ్, నరేష్ మహాముత్తారం పీఎస్సై త్రిలోక్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సివిల్, టీజీఎస్పీ పోలీస్ బలగాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నాకాబందీలో భాగంగా సరైన పత్రాలు, నెంబర్‌ప్లేట్ లేని 12ఆటోలు, 18బైక్‌లను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి వాహనదారులు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నియంత్రణకు అందరు సహకరించాలని కోరారు. సీసీ టీవీల ఏర్పాటు కోసం ముందుకు రావాలన్నారు. పలువురు హెడ్ కానిస్టేబుళ్లు తదితరులు ఉన్నారు.



సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు